సాక్షి
జగిత్యాల

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



ఈద్ ముబారక్

కోరుట్లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లావ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజులపాటు ఉపవాసదీక్షలు చేపట్టిన ముస్లింలకు శుక్రవారం నెలవంక దర్శనం ఇవ్వడంతో దీక్షలను విరమించారు. శనివారం ఉదయాన్నే కొత్తబట్టలు ధరించి మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ మతపెద్దలు ఇస్లాం సందేశాన్ని వినిపించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. వారివారి ఇండ్లలో విందు ఏర్పాటు చేసి, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్లలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్

వడగండ్ల బీభత్సం



కథలాపూర్ మండలంలో తడిసిన ధాన్యం కుప్పలు



మెట్‌పల్లిలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

- అన్నదాతను నిండా ముంచిన వాన
- తడిసిన ధాన్యం, రాలిన మామిడి
- జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో పంటనష్టం

కథలాపూర్/మల్యాల/మెట్‌పల్లి/కోరుట్లరూరల్/సారంగాపూర్: అప్పటివరకు భగభగలాడిన భానుడు. భరించలేదని ఉక్కపోత. ఎండలో పదినిమిషాలు నిల్చోలేని పరిస్థితి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. భారీగా వీస్తున్న ఈదురుగాలులు. దీనికితోడు వడగండ్లతో కురిసిన వర్షం జిల్లాను గంటసేపు అతలాకుతలం చేసింది.శనివారం సాయంత్రం జిల్లాలో వడగండ్లవాన బీభత్సం సృష్టించింది. అప్పుడే కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే గాలివానకు కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన మామిడిపండ్లు నేలరాలడంతో అన్నదాత లబోదిబోమన్నాడు. జిల్లాలోని కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, సారంగాపూర్, కొడిమ్యాల, మల్యాల మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. కథలాపూర్ మండలం తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. సిరికొండ, భూషణరావుపేటలో మామిడికాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు కొట్టుకుపోయాయి. మల్యాల మండలంలో కోతకువచ్చిన పొలాలు నేలవాలాయి. మద్దట్ల శివారులో వడగండ్లు కురవడంతో మామిడికాయలు నేలరాలాయి. ముత్యంపేటలో పిడుగుపాటుతో ఒకరు మృతిచెందారు. మెట్‌పల్లి పట్టణంలో ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగడంతో పాటు ఓ చోట స్తంభం నేల కూలింది. టౌన్-1 సెక్షన్ పరిధిలోని పలు కాలనీలకు సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేశారు. కోరుట్ల మండలంలోని పైడిమడుగు, జోగిన్‌పెల్లి, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో రాళ్లవాన కురిసింది. అకాల వర్షానికి కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. పైడిమడుగు, జోగిన్‌పల్లిలో రాళ్లవానకు నువ్వుపంట ధ్వంసమైందని రైతులు వాపోయారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి, పరిహారం త్వరగా అందించేలా చూడాలని వేడుకుంటున్నారు.



కథలాపూర్ మండలం తాండ్రాలలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



కోరుట్ల మండలంలో కురిసిన వడగండ్లు



కథలాపూర్: సిరికొండలో రాలిన మామిడి



మల్యాల యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

నేడు స్ట్రాంగ్‌రూం తాళాలు బ్రేక్

జగిత్యాల:ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ 2018 ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈనెల 10న స్ట్రాంగ్‌రూం తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీపుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను 11న కోర్టులో సమర్పించాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. 10న కలెక్టర్ యాస్మిన్‌భాషా సమక్షంలో మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే కళాశాలలోని స్ట్రాంగ్ రూంను తెరిచేందుకు వెళ్లగా అందుకు సంబంధించిన తాళాలు ఓపెన్ కాలేదు. అదేరోజు పగలగొట్టాలని ప్రయత్నించినప్పటికీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. స్ట్రాంగ్ రూం తాళాలు మాయం అయ్యాయని, హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 17న జిల్లా గత కలెక్టర్లు శరత్, రవి, ఇతర ఎన్నికల అధికారులను విచారించడం జరిగింది. కోర్టు ధర్మపురి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీల్ తెరిచి తాళాలు పగులగొట్టేందుకు హైకోర్టు అనుమతించింది. ఈసీ, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఆదివారం వీఆర్‌కే కళాశాలలోని ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూం తాళం ఉదయం 11 గంటలకు పగులగొట్టి రికార్డులను కోర్టులో సమర్పించనున్నారు.

గంజాయి నిర్మూలనకు విస్తృత ప్రచారం

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లావ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతోందని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. గంజాయి కారణంగా చాలా మంది యువకులు తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారని అన్నారు. గంజాయి సాగు, రవాణ , నిల్వ, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసులో చిక్కితే ఏడాది నుంచి 20ఏళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని వివరించారు. రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు జరిమానా విధించవచ్చన్నారు. ఎక్కడైనా గంజాయి నిల్వలు ఉన్నా, రవాణ చేస్తున్నా, సేవిస్తున్నా, విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా స్థానికులు డయల్ 100కు ఫోన్‌ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

న్యూస్‌రీల్

రైస్‌మిల్లర్లతో ఎమ్మెల్యే సమావేశం



కోరుట్ల: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆర్డీవో వినోద్ కుమార్‌తో కలిసి శనివారం సాయంత్రం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా సాగేలా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే కొనుగోళ్లు జరగాలని సూచించారు. తేమపేరుతో ఎక్కువశాతం తరుగుతీస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు, సింగిల్‌విండో చైర్మన్లు ఉన్నారు.

కొండగట్టులో సినీ దర్శకుల పూజలు



కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని సినీ దర్శకులు హరీశ్ శంకర్, రాజ్ కార్తికేన్ వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు హనుమాన్ చరిత్ర ఆధారంగా దండకం సినిమా తీస్తామని స్పష్టంచేశారు. ఈ స్క్రిప్టుకు సంబంధించిన దండకం టైటిల్‌ను ఈవో వెంకటేశ్, ప్రధాన అర్చకులు పెద్ద జితేంద్ర ప్రసాద్‌స్వామి చేతుల మీదుగా విడుదల చేశారు. దర్శకుడు హరీశ్ శంకర్ తన చిన్ననాటి మిత్రుడు ఆలయ అర్చకుడు లక్ష్మణ్‌తో మాట్లాడారు. స్వామివారి ఆశీస్సులతోనే ఇంతస్థాయికి ఎదిగామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు చిరంజీవ స్వామి పవన్ అఖిల్ జితేందర్ నాయకులు పులి వెంకటేశ్, కొత్తూరి స్వామి తిరుపతి రెడ్డి, మొగిలిపాలెం రమేశ్, నేరెళ్ల సాయి, ధార్మికేన్, రాజు పాల్గొన్నారు.

అర్హులకు దక్కేనా..?



జగిత్యాలలో ఇటీవల వీధివ్యాపారులకు కేటాయించిన షెడ్లు

- బల్దియా పరిధిలో వ్యాపార షెడ్లు కేటాయింపు
- పక్కదారి పడుతున్నాయంటున్న పలువురు లబ్ధిదారులు
- 'బినామీ' దందాకు తెరలేపిన పలువురు ప్రజాప్రతినిధులు
- జగిత్యాలలో వీధివ్యాపారుల కష్టాలు

జగిత్యాల: జగిత్యాల జిల్లాకేంద్రంలో రోడ్ల పక్కన చిరువ్యాపారాలు చేసుకునే వారికోసం ప్రభుత్వం ఇటీవల షెడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో వీధివ్యాపారులను గుర్తించి షెడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటోంది. జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇటీవల షెడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ వీధివ్యాపారులకు కేటాయించలేదు. దీంతో 'సాక్షి' దినపత్రికలో మార్చి 25న 'వీధిపాలు' చేశారని కథనం ప్రచురితం అయ్యింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి వెంటన మున్సిపల్ అధికారులతో మాట్లాడ పాతబస్టాండ్‌లో నిర్మించిన షెడ్లను అర్హులైన చిరువ్యాపారులకు కేటాయించాలని ఆదేశించారు. ఈ మేరకు కొందరికి షెడ్లు అప్పగించగా.. వ్యాపారాలు సైతం చేసుకుంటున్నారు.

ఆరోపణల వెల్లువ...

ప్రస్తుతం షెడ్లు ఏర్పాటు చేసిన చోట రెండేళ్లక్రితం వీధివ్యాపారులు చిన్నచిన్న డేరాలు వేసుకుని వ్యాపారం చేసుకునే వారు. ప్రభుత్వ అధికారులు అక్కడే షెడ్లు నిర్మిస్తామని చెప్పి వారిని ఖాళీ చేయించారు. అప్పటి నుంచి ఎక్కడెక్కడో రోడ్లపక్కన వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. షెడ్ల నిర్మాణం ఇటీవల పూర్తయ్యింది. గతంలో ఖాళీ చేసినవారికే కేటాయిస్తామని చెప్పినప్పటికీ, వేరేవారికి సైతం కేటాయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు వారికి నచ్చిన వారికి ఇచ్చినట్లు సమాచారం.

ఇదీ పరిస్థితి..

- రెండేళ్ల క్రితం పాతబస్టాండ్‌లో ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని షెడ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం వాటిని తొలగించి నూతనంగా షెడ్లు నిర్మించి వారికి కేటాయించింది.
- గతంలో మున్సిపల్ వారు ఏఏ స్థలంలో ఎవరు వ్యాపారం చేసుకుంటున్నారో జాబితా రూపొందించి, వారికే అందజేసేలా చర్యలు తీసుకున్నారు. కానీ ఇందులో కొందరు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని అక్కడున్న వారికి కాకుండా అద్దెకిచ్చుకున్న వారికే ఇచ్చినట్లు తెలిసింది.
- గతంలో కొందరు ఎంక్రోజ్‌మెంట్లు చేసి ఇతరులకు అద్దెకిచ్చేవారు. మున్సిపల్‌వారు జాబితా రూపొందించేటప్పుడు అక్కడ ఎవరు వ్యాపారం చేసుకుంటున్నారో వారి పేర్లే రాశారు.
- ప్రస్తుతం బినామీ పేర్లే ఉండటం, వారికే కేటాయించనుండటంతో ఆందోళనలు మొదలవుతున్నాయి. అద్దెకిచ్చినవారు లబోదిబోమంటున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో దాదాపు 8 నుంచి 10 వరకు వేరేవారికి కేటాయించినట్లు తెలిసింది.
- జగిత్యాలలో వీధివ్యాపారుల కోసం మూడు ప్రాంతాల్లో స్థలాలనుగుర్తించారు. ప్రస్తుతం ఓల్డ్ హైస్కూల్‌లో 37 షెడ్లు నిర్మించగా శ్రీరామ థియేటర్ సమీపంలోమరో 7 నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- జిల్లాకేంద్రంలో 6,500 మంది వీధివ్యాపారులు ఉన్నారు. అందరికీ షెడ్లు కేటాయించేలా చూడాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో మూడు జోన్లుగా కేటాయించారు. జిల్లాలో రెడ్, గ్రీన్, ఎల్లో జోన్లుగా విభజించారు.

పారదర్శకంగానే కేటాయించాం

గతంలో ఉన్న వీధివ్యాపారులకే షెడ్లు అందించేలా చర్యలు తీసుకున్నాం. మొత్తం ప్రొసీడింగ్స్ ఎవరికీ ఇవ్వలేదు. ఒకవేళ ఏమైనా ఉంటే మేము పూర్తిస్థాయిలో విచారణచేపట్టి అర్హులకే అందజేస్తాం. ఆ స్థలంలో ఇంతకు ముందు వ్యాపారం చేసుకున్న వారికే ఇస్తాం.

– బోనగిరి నరేశ్, మున్సిపల్‌కమిషనర్

క్లుప్తంగా

నేడు బసవేశ్వరుడి జయంతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులసంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొనాలన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం

వేములవాడఅర్బన్: పాలిటెక్నిక్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ శనివారం తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులలో గతంలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు. 2023 జూన్‌లో పరీక్షలు నిర్వహిస్తారని, దరఖాస్తుకు ఈనెల 24 వరకు అవకాశం ఉందని తెలిపారు.

తొలగించిన ఓటర్ల జాబితా పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో వినోద్‌కుమార్

కోరుట్ల : పట్టణంలో ఓటర్ల జాబితాలో 5 శాతం కంటేఎక్కువ తొలగించిన ఓటర్ల జాబితాను ఆర్డీవో వినోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. పట్టణంలోని 140, 143, 144,179, 151, 152, 168, 181, 189 పోలింగ్ బూత్‌ల్లో తొలగించిన జాబితాలు ఆయా బీఎల్‌వోలతో ప్రజల సమక్షంలో బహిరంగంగా చదివి వినిపించారు. క్రైమ్ రిజిస్టర్లు పరిశీలించి తొలగించిన ఓట్లు సక్రమమేనా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఆర్‌ఐ భూమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

సుల్తానాబాద్/కాల్వ శ్రీరాంపూర్: బైండోవర్‌ను ఉల్లంఘించిన కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన సంపంగి మహేశ్‌ను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్‌ను కాల్వశ్రీరాంపూర్ తహసీల్దారు ఎదుట హాజరు పరిచారు. ఆయన విచారణ చేపట్టి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. గతేడాది నాటుసారా తయారు చేస్తూ పట్టుబడగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అదే నేరం చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

రెండింటి బిల్లు ఒకే రశీదులో..

- వ్యవసాయ, గృహాల కరెంటు బిల్లు అనుసంధానం చేసే ప్రక్రియ
- పనుల్లో నిమగ్నమైన ట్రాన్స్‌కో సిబ్బంది, అధికారులు
- ఇప్పటికే జిల్లాలో 78 శాతం ప్రక్రియ పూర్తి



కథలాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కథలాపూర్ (వేములవాడ): వ్యవసాయానికి త్రీ ఫేజ్ కరెంట్ ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం కేవలం సర్వీస్ చార్జీలు వసూలు చేస్తోంది. మరోవైపు గృహాలకు, వాణిజ్య అవసరాలకు మాత్రం వినియోగాన్ని బట్టి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. గృహాలు, వ్యాపారాలకు వినియోగించే బిల్లులు నెలనెలా వసూలు చేస్తుండగా వ్యవసాయానికి సంబంధించి బిల్లులు ఏడాదికోసారి వసూలు చేస్తున్నారు. వేర్వేరుగా బిల్లులు వసూలు చేయడం ట్రాన్స్‌కో సిబ్బంది, అధికారులకు ఇబ్బందిగా మారింది. వ్యవసాయ మోటార్ల కనెక్షన్ల సర్వీస్ నెంబర్లను గృహాల కనెక్షన్ల సర్వీస్ నెంబర్‌కు అనుసంధానం చేసే పనులు చేపడుతున్నారు. ఇదీ పూర్తయితే ఒకే రశీదుపై గృహాల, వ్యవసాయ బిల్లు వినియోగదారులకు చేరుతుంది. ఇందుకోసం ట్రాన్స్‌కో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 4.9 లక్షల విద్యుత్ కనెక్షన్లు..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలుండగా విద్యుత్ కనెక్షన్లు 4,95,779 ఉన్నాయి. ఇందులో వ్యవసాయ మోటార్లకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు 1,34,473, గృహాలకు 3,23,712, వాణిజ్య అవసరాలకు వినియోగించే కనెక్షన్లు 37,594 ఉన్నాయి.

బిల్లుల వసూళ్లకు ఇబ్బంది ఉండొద్దనే..

వ్యవసాయానికి సంబంధించి మోటార్లకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నా ఏడాదికోసారి కేవలం సర్వీస్ చార్జీలు వసూలు చేస్తారు. కానీ గృహాలు, వాణిజ్య కనెక్షన్ల బిల్లులు మాత్రం నెలానెలా వసూలు చేస్తుంటారు. వ్యవసాయ మోటార్ల సర్వీస్ చార్జీలు ప్రత్యేకంగా వసూలు చేయడం సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందని, రెండు బిల్లులు ఒకే రశీదుపై ఉంటే సులువుగా బిల్లులు వసూలు చేయవచ్చని అధికారులు తెలుపుతున్నారు. ఇందుకు గృహాలు, వ్యవసాయ కనెక్షన్ల సర్వీస్ నెంబర్లను అనుసంధానం చేయడంతోపాటు వినియోగదారుల సెల్‌ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒకేసారి గృహాలు, వ్యవసాయ, విద్యుత్ బిల్లులు వసూలు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 78 శాతం అనుసంధానం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

లక్ష్యం మేరకు వసూలు చేయొచ్చు



గృహాలు, వ్యవసాయ కనెక్షన్లు, సెల్‌ఫోన్ నెంబర్లకు అనుసంధానం చేయడంతో వినియోగదారులను అలర్ట్ చేసే అవకాశం ఉంటుంది. విద్యుత్ బిల్లుల బకాయిల వివరాలు సెల్‌ఫోన్‌కు మెసెజ్ రావడంతో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. ఈ నిర్ణయంతో మారుమూల గ్రామాలవారికి విద్యుత్ సమాచారం తెలిసి బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంటుంది. విద్యుత్ బకాయిలు లక్ష్యం మేరకు వసూలు చేయవచ్చు.

– గుగ్లోత్ రవినాయక్, కథలాపూర్

నెలనెలా వసూళ్లతో భారం తప్పుతుంది



వ్యవసాయ మోటార్ల సర్వీస్ చార్జీలు సంవత్సరానికి ఓసారి వసూలు చేసే బదులు నెలనెలా సమాన వాయిదాలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దీంతో రైతులకు ఆర్థికంగా భారం తప్పుతుంది. ఏడాది చివరలో బిల్లులు చెల్లించాలంటే బిల్లులు చెల్లించని పరిస్థితి ఉంటుంది. బకాయిలు పెరుగుతాయి. నెలనెలా బిల్లులు చెల్లించే విషయంపై అధికారులు ఆలోచించాలి.

అల్లూరి దేవారెడ్డి, రైతు, బొమ్మెన గ్రామం

వినియోగదారులు సహకరించాలి



విద్యుత్ వినియోగదారుల సమాచారం సమగ్రంగా ఉండాలని గృహాల సర్వీస్ నెంబర్లు, వ్యవసాయ మోటార్ల సర్వీస్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నాం. ఇకనుంచి గృహాలు, వ్యవసాయ కనెక్షన్ల బిల్లులు ఒకే రశీదుపై నమోదవుతాయి. దీంతో ఒకేసారి బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది. వినియోగదారులకు బిల్లుల సమాచారం చరవాణికి మెసెజ్ వస్తుంది. వినియోగదారులు సహకరించాలి.

– బొప్పరాతి రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల

కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు వైవీ.రావు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ ఉప కార్యదర్శి వైవీ.రావు అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్మిక కుటుంబాలు సింగరేణి అసుపత్రికి వెళ్తే సరైన ట్రీట్మెంట్, మందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓసీపీ–1లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ తల్లిని సింగరేణి ఆసుపత్రిలో చేర్పిస్తే హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. యాజమాన్యం స్పందించి సింగరేణి ఆసుపత్రిల్లో సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, రాంచందర్, తిరుపతి, సమ్మయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

ఆత్మవిమర్శ సభ పెట్టుకోవాలి

రుద్రంగి(వేములవాడ): నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరుస్తాడని ఎమ్మెల్యేగా గెలిపిస్తే రమేశ్‌బాబు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. జర్మనీలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని విమర్శించారు. రుద్రంగిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనం కాకుండా ఆత్మవిమర్శ సభ పెట్టుకోవాలని హితవు పలికారు. పార్టీ గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు పల్లి గంగాధర్, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, ధార్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరీంనగర్ క్రైం: పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోన సముద్రంకు చెందిన భార్గవి (24)కి నగరంలోని గౌతమినగర్‌కు చెందిన గొల్లపల్లి రాజు అలియాస్ సాగర్‌తో 2018లో ప్రేమ వివాహం జరిగింది. కొంతకాలంగా భర్త, అత్త, ఆడపడుచు వారు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈనెల 20న మళ్లీ వేధించడంతో మార్కెట్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్గవి కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వచ్చి నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతిచెందింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరలు లభిస్తాయని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు పేర్కొన్నారు. కోనరావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

జమ్మికుంట: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక రాజయ్య (61) శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బార్పాటి రమేశ్ తెలిపారు.

యువతి అదృశ్యం



కొండ మమత

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కొండ మమత (24) అనే మతి స్థిమితం లేని యువతి అదృశ్యమైనట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మమత కొంతకాలంగా మతి స్థిమితంతో బాధపడుతోంది. ఈనెల 21న ఇంట్లోంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు తెలిసినా చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 8712670766 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు వీరే

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులో కల్వర్టును కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ కుటుంబం శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాండ్ర్యాల శివారులో కల్వర్టును వీరి కారు ఢీకొంది. కారులో ఉన్న రాకేశ్, నరేశ్, నంద్ అనే ఐదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ తన వాహనంలో కథలాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులు నిర్మల్‌కు వెళ్లారు.

తల్లీ, కూతురు అదృశ్యం





అదృశ్యమైన తల్లి, కూతురు

మల్యాల (చొప్పదండి): తన రెండేళ్ల కూతురితో ఓ తల్లి అదృశ్యమైన ఘటన మల్యాల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాలకు చెందిన లత అలియాస్ భవానికి మండల కేంద్రానికి చెందిన బొల్లారపు శ్రీకాంత్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు వర్షిణి ఉంది. భర్తతో గొడవ జరిగింది. దీంతో లత తన కూతురితో ఈనెల 19న ఇంట్లోంచి వెళ్లింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తల్లి రాగుల లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దమ్మన్నపేటలో అన్నం నర్సాగౌడ్‌కు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో చనిపోయింది. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ తీగలు గేదెపై పడడంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందింది. సంఘటన స్థలాన్ని సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు పరిశీలించారు. రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

- తప్పించుకు తిరుగుతున్న వారిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు
- నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు
- కేసుల సత్వర పరిష్కారంపై దృష్టిసారించిన వైనం



నాన్ బెయిలబుల్ వారెంట్ల వివరాలు..
2022లో జారీఅయిన నాన్ బెయిలబుల్ వారెంట్లు : 275
2023లో ఇప్పటివరకు జారీఅయిన నాన్‌బెయిలబుల్ వారెంట్లు : 164

జగిత్యాల క్రైం: కోర్టుల్లోని కేసుల సత్వర పరిష్కారం కోసం పోలీసులు, న్యాయస్థానం ప్రత్యేక దృష్టిసారించింది. కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వారిని గుర్తించి కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీచేస్తున్నారు. కోర్టు జారీచేసిన వారెంట్లలో ఉన్న నిందితులను జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి వారిని పట్టుకొని పోలీసులు కోర్టులో హాజరుపరుస్తున్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు.

గత సంవత్సరం 275 వారెంట్లు జారీ...

జిల్లాలో వివిధ కేసుల్లో కోర్టులో హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న వారిపై 2022లో 275 నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేయగా సుమారు 70 శాతం కేసుల్లో పోలీసులు నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 164 నాన్ బెయిలబుల్ వారెంట్లు కోర్టు జారీచేయగా సుమారు 61 మందిని పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. మిగతా వారికోసం ప్రత్యేక బృందాలు ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. కొందరు అనారోగ్యంతో, ఇతర కారణాలతో మృతిచెందగా వారి మరణ ధ్రువీకరణ పత్రాలను కోర్టులో సమర్పిస్తున్నారు.

ప్రత్యేక బృందాలకు నిందితుల వివరాలు..

జిల్లాలో నాన్‌బెయిలబుల్ వారెంట్లను కోర్టు జారీచేయడంతో ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసు వివరాలతో పాటు నిందితుల వివరాలను ప్రత్యేక బృందాలకు అందజేస్తున్నారు. దీంతో ఆ బృందాలు జిల్లా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉండి కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న నేరస్తులను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీనిపై కోర్టుల్లో నాన్ బెయిలబుల్ వారెంట్ల ప్రక్రియ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

సత్వర న్యాయం జరిగేలా చర్యలు



జిల్లాలో న్యాయస్థానాల్లో కేసులు ఉండి కోర్టులో హాజరుకాకుండా తిరుగుతున్న వారిపై కోర్టులు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేస్తున్నాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. నిందితులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ఎల్లారెడ్డిపేట లో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. సీపీఐ తలపెట్టిన ఇంటింటికి ప్రజా చైతన్య యాత్ర శనివారం ముస్తాబాద్ చేరుకుంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో యాత్ర సాగుతోందని తెలిపారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు. సీపీఐ నాయకులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, మీసం లక్ష్మణ్, సదానందం, నరేశ్ పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడదాం

వీర్నపల్లి(సిరిసిల్ల): బీజేపీ కుట్రలను తిప్పి కొడదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర శనివారం సాయంత్రం వీర్నపల్లి చేరుకుంది. వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.


బద్దం ఎల్లారెడ్డి వారసులం మేమే..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకోబోమని, బద్దం ఎల్లారెడ్డికి వారసులం మేమేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ప్రజాచైతన్యయాత్ర శనివారం ఎల్లారెడ్డిపేటకు చేరిన సందర్భంగా మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటి వేణు, వెంకటస్వామి, పవన్, గూడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి కింద రూ.5 లక్షలు ఇవ్వాలి

వేములవాడరూరల్: ప్రజల పక్షాన ఉంటూ పోరాడేది పార్టీ సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ప్రజాచైతన్య యాత్ర శనివారం రాత్రి వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలోనే దాడులు, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతుందన్నారు. దేశంలో 5,907 మంది అవినీతిపరులు రాజ్యమేలుతున్నారన్నారు. రాజకీయ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డా రు. నిరుపేదలకు స్థలం ఉంటే గృహలక్ష్మి కింద రూ.5లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు లక్ష్మి, మల్లక్క, పద్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, కేవీ అనసూయ, ఎల్ల దేవరాజు, పోచెట్టి, శాంత, నర్సయ్య, పోచమల్లు పాల్గొన్నారు.

నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం



మాట్లాడుతున్న కె.రాజన్న

గోదావరిఖని: నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. శనివారం లెనిన్ 153వ జయంతిని స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే భూమి, భుక్తి, విముక్తి సాధ్యమన్నారు. ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన లెనిన్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. కార్యక్రమానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, కె.మొగిలి, బి.బుచ్చయ్య, వి.సదానందం, కె.లింగమూర్తి, మహేందర్, బొట్టు రవికుమార్, మంగ, రజిత, మొండన్న, సుధాకర్, సాంబయ్య, నర్సయ్య, గుండు రాజయ్య, ఆర్.రాయమల్లు, బాలకృష్ణ, మధూకర్, అన్వేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

లెనిన్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు

గోదావరిఖని: లెనిల్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు సాధించుకుందామని సీపీఎం రాష్ట్ర నేత భూపాల్ తెలిపారు. స్థానిక రాజ్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో భూపోరాట కేంద్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ 153వ జయంతిని నిర్వహించారు. పాలకులు ప్రజలను ఎలా గౌరవించాలో ఆచరణలో నిరూపించిన లెనిన్ మార్గం విలువైందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కాకుండా సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు చేస్తున్నామని తెలిపారు. నాయకులు ముత్యంరావు, వై.యాకయ్య, ఎం.రామాచారి, లావణ్య, భిక్షపతి, నాగమణి, ఉపేందర్, సంజీవ్, నాగలక్ష్మి, లక్ష్మారెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

సైద్ధాంతికకర్త లెనిన్

జ్యోతినగర్: కమ్యూనిస్టు విప్లవోద్యమ సైద్ధాంతిక కర్త లెనిన్ అని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో లెనిన్‌కు నివాళుర్పిలంచారు. మోదీ తీసుకొస్తునన ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్, నాయకులు గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మీ, చంద్రయ్యతో ఉన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టా ఇవ్వాలని సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకులు బి.అశోక్ అన్నారు.

క్లుప్తంగా

ధర్మాన్ని రక్షించి.. గోమాతను పూజిద్దాం



మాట్లాడుతున్న ప్రముఖ్ విఠలాచార్య

ఇబ్రహీంపట్నం: ధర్మాన్ని రక్షించి గోమాతను పూజించాలని, ధర్మం చాలా గొప్పదని విశ్వ హిందూ పరిషత్ కరీంనగర్ విభాగ్ ధర్మప్రసార ప్రముఖ్ విఠలాచార్య అన్నారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ హిందువులు ఐక్యతతో ఉండాలని, శ్రీరాముని వారసులం కాబట్టి భగవద్గీత, రామాయణం చదవాలని సూచించారు. ప్రాంత గోరక్ష ప్రముఖ్ ఇసాంపెల్లి వెంకన్న మాట్లాడుతూ గోవులను కాపాడుకునే పూజించాలని కోరారు. గో ఉత్పత్తులను వాడాలని, గోమూత్రంతో క్యాన్సర్ కూడా నయం అవుతుందని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ జగిత్యాల సహాకార్యవాహ తుక్కరం, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు గజం రాజు, కుకండ కార్యదర్శి మర్రి భాస్కర్, జగిత్యాల జిల్లా ధర్మరక్షక్ మర్రిగడ్డ శ్రీనివాస్, నేమూరి సత్యనారాయణ, ఊటూరి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సూర్యగ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని సూర్యగ్లోబల్ స్కూల్ పాఠశాల వార్షికోత్సవం శనివారం సుమంగళి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీధర్‌రావు, డైరెక్టర్లు ప్రశాంత్‌రావు, హరిచరణ్‌రావు, రజితరావు, మౌనికరావు, సుమన్‌రావు, అజిత్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జాతర



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మార్కండేయస్వామి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా ఊరేగించారు. భక్తజన సందడిలో స్వామివారి కల్యాణం జరిపించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు అంబల్ల రాజారాం, కోశాధికారి గంగుల శ్రీనివాస్, ప్రతినిధులు జిందం బసవయ్య, అంబల్ల అశోక్ పాల్గొన్నారు.


మండలస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గోలి మోహన్

కథలాపూర్: క్రీడాకారులు లక్ష్యం మేరకు రాణించి తమ జట్టు గెలుపులో భాగస్వాములు కావాలని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత గోలి మోహన్ అన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలో కేఎంపీఎల్ పేరిట నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని శనివారం ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు గడ్డం భూమరెడ్డి, గాండ్ల స్వామి, మామిడిపెల్లి రవి, నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్ పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు దుస్తులు పంపిణీ



రాయికల్: పట్టణంలో మా కామాఖ్య హాస్పిటల్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు మహ్మద్ ఇర్ఫాన్, శ్రీగద్ది నరహరి, మహ్మద్ షాకీర్ పాల్గొనారు.

నాట్యమయూరి అంజనశ్రీ

- కాలు కోల్పోయినా.. కృత్రిమ కాలుతో నాట్యంలో రాణింపు
- ఉత్సవాల్లో ప్రదర్శనకు ప్రశంసలు
- ఆదర్శంగా నిలుస్తున్న విద్యార్థి





రాయికల్: నాట్యం చేయాలనే తపన.. ఆ చిన్నారి అంగవైకల్యాన్ని సైతం జయించింది. ప్రమాదంలో కాలు కోల్పోయినా మొక్కవోని దీక్షతో కృత్రిమ కాలుతో నాట్యం చేస్తూ అందరితో శభాష్ అనిపించుకుటోంది. సుధాచంద్రన్ స్ఫూర్తితో కూచిపూడి నృత్యంలో రాణిస్తూ ఎందరో విద్యార్థులకు, దివ్యాంగులకు ఆదర్శంగా నిలుస్తోంది.

సండే స్పెషల్

ఎడమ కాలు కోల్పోయినా..

- రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన బొమ్మకంటి నాగరాజు, గౌతమి దంపతుల కూతురు అంజనశ్రీ. నాలుగేళ్ల వయస్సులో ఓ ప్రమాదంలో ఎడమకాలు పూర్తిగా కోల్పోయింది. దీంతో అంజనశ్రీకి కృత్రిమ కాలును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాయికల్‌లోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 5వతరగతి చదువుతోంది. తన స్నేహితులు నాట్యం, డ్యాన్స్ చేస్తుంటే తనకు కూడా నాట్యం చేయాలని ఆసక్తి పెరిగింది. పట్టణంలోని కూచిపూడి శిక్షకుడైన మచ్చ దేవదాసు వద్ద శిక్షణ పొందింది. ఇటీవల హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభలో దివంగత పద్మశ్రీ శోభానాయుడు జయంతి సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో ప్రతిభ ప్రదర్శించి ప్రశంసా పత్రం పొంది చిన్నారులకు, దివ్యాంగులకు అంజనశ్రీ ఆదర్శంగా నిలిచింది.



తల్లిదండ్రులతో అంజనశ్రీ

నాట్యంలో రాణిస్తోంది



నాట్యం చేస్తానని అంజనశ్రీ నా దగ్గరికి వచ్చినప్పుడు నీకు కష్టంగా ఉంటుంది. అర్థం చేసుకో అమ్మా అని చెప్పగానే ఎలాగైనా నేను నాట్యం నేర్చుకుంటాను. నాకు శిక్షణ ఇవ్వండి అని ఆ విద్యార్థిని చెప్పగానే ఆమె తపన నాకు నచ్చి శిక్షణ ఇచ్చాను. నాట్యంలో మంచిగా రాణిస్తోంది.

– మచ్చ దేవదాసు, శిక్షకుడు

అంజనశ్రీని ప్రోత్సహిస్తాం



నా కూతురు కృత్రిమ కాలుతో నాట్యం నేర్చుకుంటా నాన్న అనగానే ఎలాంటి ఆలోచన లేకుండా ఒప్పుకున్నాం. చదువుతో పాటు నాట్యంలో కూడా రాణించడం నాకు గర్వకారణం. దివ్యాంగులు ఎప్పుడు కూడా నిరాశ చెందవద్దు. వారిని ప్రోత్సహించాలి.

– నాగరాజు, అంజనశ్రీ తండ్రి

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



నేలరాలిన మామిడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: ఈదురుగాలులతో నష్టపోయిన మామిడి రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని, రైతులెవరూ అధైర్య పడొద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో మామిడి తోటలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడి రైతుల విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని, త్వరితగతిన అధికారులతో సర్వే చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం వారికి అలవాటుగా మారిందని, ఆయన చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు తలారి రాజేశ్, ఎలిగేటి అనిల్‌కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రవి, వెంకమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేసేలా చూస్తా

జగిత్యాల: కుర్మ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చూస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం కుర్మ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్మలదైవం అయిన బీరప్పస్వామి ఆలయం వద్ద మౌలిక వసతులతో పాటు భవనం ఏర్పాటు చేసేలా చూడాలని కోరగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు గంగమల్లు, బీరయ్య పాల్గొన్నారు.

మెగా ఇంపాక్ట్ ప్రోగ్రామ్‌కు హాజరుకావాలి

నిరుద్యోగ యువత కోసం మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం కరీంనగర్‌లో ఈనెల 25, 26న వీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారని, నిరుద్యోగులందరూ హాజరు కావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ప్రోగ్రామ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా ఇంపాక్ట్ సభ్యులు నరేశ్, పవన్, రాజేందర్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలి



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్: ఉమ్మడి జిల్లాలోని ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని చెరుకు రైతుల ప్రయోజనార్థం వెంటనే తెరిపించాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శనివారం మెట్‌పల్లి మండలం వేంపేట నుంచి మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ వద్దకు కాంగ్రెస్ శ్రేణులు, చెరుకు రైతులతో కలిసి వారు పాదయాత్రగా తరలివచ్చి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రైతు సంక్షేమంటూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు రైతుల గోడును పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరుతున్న చెరుకు రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వ పరంగానైనా, ప్రైవేటు పరంగానైనా వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఇక నుంచి ప్రతి నెలా 22న అక్టోబర్ వరకు ఒక్కో గ్రామం నుంచి షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు షుగర్ ఫ్యాక్టరీ ఎదుట సీఎం కేసీఆర్, ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, వేంపేట ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు అల్లూరి సురేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, లింగారెడ్డి, బద్దం స్వామి, మామిడి లక్ష్మారెడ్డి, మరిపెల్లి మల్లయ్య, రాజేందర్‌రెడ్డి, తిరుమల గంగాధర్, పెరుమాండ్ల సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, క్రాంతికుమార్, కొమిరెడ్డి లింగారెడ్డి, శ్రీనివాస్, అందె మారుతి, జెట్టి లక్ష్మణ్, మామిడి మహేశ్, నల్ల శేఖర్, ఏలేటి మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



కోరుట్ల: వేడుకల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు




జగిత్యాల: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ముస్లింలు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లావ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజులుగా పవిత్ర ఉపవాసాలను ఆచరించి శనివారం ఉపవాస దీక్షలను విరమించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. మత గురువులు మహ్మద్ ప్రవక్త సందేశాన్ని అందించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నంలో..



రాయికల్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మల్లాపూర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వారు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రాజేశ్, సీసీలు రమేశ్, రాజు, సీఏ సరిత, పీఏసీఎస్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, తక్కల్ల నరేశ్‌రెడ్డి, సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, బొల్లం కృష్ణవేణి, నత్తి లావణ్య, ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, ఆకుతోట రాజేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో..

మేడిపెల్లి: మండలంలోని దమ్మన్నపేట్, మన్నెగూడెం, గోవిందారం గ్రామాల్లో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు ప్రారంభించారు. ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, సర్పంచ్‌లు సురేశ్, నరేశ్‌రెడ్డి, మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, కిషన్‌రావుపల్లె, సంగెం, నాగులపేట, గుమ్లాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ ప్రారంభించారు. సర్పంచ్‌లు గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, పిడుగు రాధ, చెప్యాల నర్సయ్య, కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నీలగిరి అమ్మాయి, ఎంపీటీసీలు గుగ్గిళ్ల ప్రియాంక, బోడ గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు సింగిరెడ్డి నర్సారెడ్డి, చింతకుంట సాయిరెడ్డి, ఐకేపీ ఏపీఎం నరహరి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొల్వాయి విండో పరిధిలో..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి సింగిల్‌విండో పరిధిలోని తాళ్లధర్మారం, కమ్మునూర్, కోమన్‌పల్లి గ్రామాల్లో శనివారం యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైఎస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచ్‌లు నల్ల మహిపాల్‌రెడ్డి, బందెల మరియ, సీపతి రమేశ్, ఎంపీటీసీలు రంగు లక్ష్మణ్, నారపాక రమ, విండో వైస్‌చైర్మన్ ఎనగందుల శ్రీనివాస్, సీఈవో రాజేందర్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్, శాలపల్లి గ్రామాల్లో పెగడపల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. సర్పంచ్‌లు శంకర్, తార, ఎంపీటీసీ శోభ, విండో వైస్‌చైర్మన్ రాజశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ సత్తయ్య, విండో డైరెక్టర్లు మల్లేశం, మోహన్, నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శంకర్, గంగారెడ్డి, కిషన్‌రావు, వీరేశం, తిరుపతి పాల్గొన్నారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి, లంబాడిపల్లి, తాటిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సర్పంచ్‌లు గొడుగు కుమారస్వామి, దొంగ కరుణాకర్‌రెడ్డి, బింగి జ్యోత్స్న, ఐకేపీ ఏపీఎం రాజయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రభాకర్, రజనీ, సుమ, లత, జల పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుక



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కోరుట్ల: పట్టణంలోని సిద్ధార్థ విద్యాసంస్థల వీడ్కోలు వేడుకలు స్థానిక ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో నీరజ, విద్యాసంస్థల కరస్పాండెంట్ బాలాజీ దామోదర్, కటుకం జగదీశ్వర్, రమా కమలాకర్, ప్రధానోపాధ్యాయులు వినోద, టీవీ సిద్ధార్థ, నాగభూషణం పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

జగిత్యాలక్రైం: 2023కు గాను క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఉమెన్ కేసులపై పోలీసు అధికారులు తీసుకున్న ప్రత్యేక చొరవతో జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలోనే 14వ స్థానం సాధించడంతో రూరల్ ఎస్సై అనిల్‌ను శనివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు నాగరాజు, భార్గవరామ్, గంగప్రసాద్, వరుణ్, వంశీగౌడ్ పాల్గొన్నారు.

పొలస్తేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామశివారులోని శ్రీపొలస్తేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీఉమా సహిత పొలస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండాల్‌రావు, వైస్ చైర్మన్ రంగు రాజయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: రాయికల్–బీర్‌పూర్ మండలాలను కలిపే తుంగూర్–కట్కాపూర్ రోడ్డు తెగిపోయి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అభివృద్ధి చర్యలు లేవని బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డును పరిశీలించి నిరసన తెలిపారు. గత వర్షాకాలం రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో తుంగూర్–కట్కాపూర్ (రాయికల్) రోడ్డు మధ్యన తుంగూర్–కండ్లపల్లి గ్రామాల మధ్యన రోడ్డు తెగిపోయి ఆరునెలలు గడిచినా దీనిపై పూర్తిస్థాయి మరమ్మతు చేపట్టకపోవడంతో బీర్‌పూర్ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో అధికార పాలకులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ వేముల కరుణాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆడెపు రమేశ్, శ్రీనివాస్, దూట నరేందర్, రాకేశ్, వంశీ, తిరుపతి పాల్గొన్నారు.

కలిగోట సూరమ్మ చెరువు కాలువ పనులు ప్రారంభించండి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: కలిగోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువ పనులను వెంటనే ప్రారంభిచాలని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువ పనులకు శంకుస్థాపన చేసి, నిధులు మంజూరు చేసి సుమారు ఐదేళ్లు కావస్తున్నా పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, లచ్చనాయక్, మేడిపెల్లి, బీమారం మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో మండల పూజ



మండల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామలో గల్ఫ్ సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి, సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం మండల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించి 41 రోజులు అయిన సందర్భంగా మండల పూజను అర్చకులు ఘనంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు స్వామివార్లను, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సాగుతున్న బీరప్ప ఉత్సవాలు



బతికపల్లిలో బీర్ల కళాకారుల ప్రదర్శన

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో గొల్ల–కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప దేవుని ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం వీరగంధాలతో బీర్ల కళాకారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనల మధ్య గంగ బోనం ఊరేగింపు కార్యక్రమం జోరుగా సాగింది. ఊరేగింపు ఆద్యంతం ఆసక్తిగా కొనసాగింది. గొల్లకుర్మలు ఐదేళ్లకోసారి జరుపుకునే ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వారి బంధు,మిత్రులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.